క్లుప్తంగా

ఇన్‌చార్జ్ ఎంఈఓల నియామకం

నారాయణపేట రూరల్:జిల్లా పరిధిలో ఇటీవల పదవీ విరమణ పొందిన ఎంఈఓల స్థా నంలో ఇన్‌చార్జి ఎంఈఓలను నియమిస్తు సోమవారం స్కూల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఊట్కూరు మండలం బాలికల ఉన్నత పాఠశాల జీహెచ్ఎం మాధవి, నర్వ మండలం ఉందేకోడ్ జీహెచ్ఎం రాంరెడ్డిలను ఎఫ్ఏసీ ఎంఈఓలుగా బాధ్యతలు అప్పగించినట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కృష్ణా: మండలంలోని గుడెబల్లూర్ సబ్‌స్టేషన్ పరిధిలో మంగళవారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్న ఏఈ ధర్మతేజ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలో పడిపోయిన విద్యుత్‌స్తంభాల పునరుద్ధరణతో పాటూ పలు మరమ్మతు పనుల్లో భాగంగా సరఫరాలో అంతరాయం కలుగనున్నట్లు పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

విద్యా సామగ్రి పంపిణీ



ఊట్కూరు: మండలంలోని వల్లంపల్లి పాఠశాలలో ప్రమీల ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు తదితర వస్తువులు పంపిణీ చేశారు. విద్యార్థులు ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు డాక్టర్ కోరం మహేష్, ప్రధానోపాధ్యాయురాలు సుజాత, పీఆర్టీయూ మండల అధ్యక్షుడు గోవర్ధన్, ఉపాధ్యాయులు సత్యపాల్, శశిధర్‌రెడ్డి పాల్గొన్నారు.

అభ్యర్థుల అసంతృప్తి




మరికల్: సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో తాత్కాలిక పద్ధతిలో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, అధ్యాపక పోస్టుల భర్తీ కోసం సోమవారం నిర్వహించిన డెమో క్లాస్ నిర్వహణపై నిరుద్యోగులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి దాదాపు 200 పైగా నిరుద్యోగులు హాజరవగా కేవలం మహిళల నుంచి మాత్రమే డెమో తీసుకుంటామని నిర్వాహకులు చెప్పడంతో ఇంటర్వ్యూలకు వచ్చిన పురుష అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేశారు. స్పందించిన అధికారులు అనంతరం పురుష అభ్యర్థుల నుంచి ఇంటర్వ్యూలు తీసుకున్నారు.

జీపీఎఫ్ ఖాతాలు ఆన్‌లైన్ చేయాలి



నారాయణపేట రూరల్: ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయుల జీపీఎఫ్ ఖాతాలను ఆన్‌లైన్ చేయాలని కోరుతూ తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) ఆధ్వర్యంలో సోమవారం జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి శైలేంద్రకు వినతిపత్రం ఇచ్చారు. సిబ్బంది కొరత వల్ల జీపీఎఫ్ ఖాతాలు పెండింగ్‌లో ఉన్నాయని చొరవ తీసుకొని వెంటనే ఆన్‌లైన్ చేయిస్తానని సీఈఓ తెలిపారు. జీపీఎఫ్ చెల్లింపులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకొని ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష కార్యదర్శులు శేరి కృష్ణారెడ్డి, నరసింహ, జిల్లా కోశాధికారి కిషోర్‌కుమార్ పాల్గొన్నారు.

పాఠశాలకు వెళ్లేదెట్లా?



మాగనూర్: మండలంలోని తళంకేరి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు వెళ్లే దారి మొత్తం బురదమయంగా మారడంతో విద్యార్థులకు నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని తల్లిదండ్రులు వాపోతున్నారు. పాఠశాల గ్రామానికి దూరంగా ఉండటంతో చుట్టూ పంట పొలాల కారణంగా దారి మొత్తం బురదగా మారి కనీసం నడవడానికి కూడా వీలు లేకుండా ఉంది. దీంతో పాఠశాలకు చేరుకోవడానికి విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇంకా వర్షాలు పెరిగితే రోడ్డు మరింత అధ్వాన్నంగా మారుతుందని వాపోయారు. ఈ విషయంపై సంబంధిత అధికారులు స్పందించి పాఠశాలకు వెళ్లే దారిలో ఉన్న బురదను తొలగించి, సరైన దారి ఏర్పాటు చేయాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

రైతు సంక్షేమమే ఎజెండా

సాక్షి, నెట్‌వర్క్: రైతు సంక్షేమమే లక్ష్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం పనిచేస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న అన్ని రైతువేదికల ద్వారా సోమవారం సీఎం రైతు నేస్తం కార్యక్రమంలో భాగంగా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అనుభవం కలిగిన రైతుల సహకారంతో గ్రామంలోని రైతులకు వరికి ప్రత్యామ్నాయంగా కూరగాయలు, పండ్లతోటలు, వాణిజ్య పంటల సాగుపై అవగాహన కల్పించాలని వ్యవసాయాధికారులకు సూచించారు. దామరగిద్ద రైతువేదికలో కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, జిల్లా వ్యవసాయ, ఉద్యాన శాఖ అధికారులు రైతులు హాజరైన సీఎం రేవంత్‌రెడ్డి సందేశాన్ని వీక్షించారు.

అర్హులందరికీ రైతు భరోసా

అర్హత కలిగిన రైతులందరి ఖాతాల్లో సోమవారం నుంచి ఎకరాకు రూ.6వేల చొప్పున రైతు భరోసా డబ్బులు జమ చేస్తామని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్, జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్, ఉద్యానవన శాఖ అధికారి సాయిబాబ, ఎంపీడీఓ రమేష్, తహసీల్దార్లు సతీష్‌కుమార్, రాంకోటి, విండో అధ్యక్షుడు ఈదప్ప, మండల విద్యాధికారి మణిచందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బాల్‌రెడ్డి, టెక్నికల్ ఏఓలు హరిత, మితిన్‌చక్రవర్తి, నవీన్‌కుమార్, ఏఈఓలు పరశురామ్, శ్రవణ్‌కుమార్, శ్వేత, కోస్గి ఏఎంసీ చైర్మన్ భీములు, కాంగ్రెస్ నాయకులు, రైతులు పాల్గొన్నారు.



దామరగిద్దలో రైతు నేస్తం కార్యక్రమంలో పాల్గొన్న కలెక్టర్ సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



రుద్రసముద్రంలో పాల్గొన్న అడిషనల్ కలెక్టర్ సంచిత్‌గంగ్వార్



ధన్వాడలో..



మద్దూరులో..

నెరవేరుతున్న సొంతింటి కల



జలాల్‌పూర్‌లో శంకుస్థాపన చేస్తున్న శివారెడ్డి



భూమి పూజలో లబ్ధిదారులు,అధికారులు

నారాయణపేట రూరల్: రాష్ట్రంలో బీద, మధ్యతరగతి ప్రజల సొంతింటి కలను కాంగ్రెస్ ప్రభుత్వం నెరవేరుస్తుందని మార్కెట్ కమిటీ చైర్మన్ రాంపురం సదాశివరెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామానికి మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు సోమవారం భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ.. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం డబుల్‌బెడ్రూం ఇళ్లను ఇస్తామని మోసం చేసిందన్నారు. మిగులు రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిందని ధ్వజమెత్తారు.కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

ధన్వాడ: మండల పరిధిలోని గోటూర్ గ్రామంలో మొదటి విడతలో మంజూరైన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు అధికారులు భూమి పూజలు నిర్వహించా రు. ఇంటి నిర్మాణం ప్రారంభించిన తరువాత విడుతల వారీగా లబ్ధిదారులకు డబ్బులు పడుతాయని పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి అన్నారు. కార్యక్రమంలో సుదర్శన్‌రెడ్డి, నారాయణ, బాలరాజు పాల్గొన్నారు.

నర్వ ఎంఈఓగా రాంరెడ్డి

నర్వ: మండల ఎంఈఓ రామకృష్ణ కొద్ది రోజుల క్రితం పదవీ విరమణ పొందడంతో ఖాళీగా ఉన్న ఎంఈఓ పోస్టుకు నియామక ఉత్తర్వులు వెలువడ్డాయి. ఉందేకోడ్ జీహెచ్ఎంగా ఉన్న రాంరెడ్డి మండలంలో సీనియర్ కావడంతో ఆయనను ఎఫ్ఏసీ ఎంఈఓగా నియమిస్తూ విద్యాశాఖ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఎంఈఓ రాంరెడ్డికి సీఆర్పీ నర్సిములు, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది రైసభాను, రాంరెడ్డి, ఐఈఆర్పీ రవి అభినందనలు తెలిపారు.

ఫ్రిడ్జ్ ఇస్తామని రూ.10 వేలు టోకరా

మరికల్: థమ్సప్ కూల్‌డ్రింక్ కంపెనీ నుంచి ఫ్రిడ్జ్ వచ్చిందని ఓ బెల్ట్‌షాపు యాజమానికి మాయమాటలు చెప్పి రూ.10 వేలు టోకరా వేసిన ఘటన సోమవారం తీలేర్‌లో చోటు చేసుకుంది. తీలేర్‌కు చెందిన బెల్ట్‌షాపు యజమాని హన్మంతు దగ్గరకు గుర్తు తెలియని వ్యక్తి వచ్చి థమ్సప్ కంపెనీ నుంచి వచ్చిన్నట్లు పరిచయం చేసుకున్నాడు. కంపెనీ నుంచి మీకు ఫ్రిడ్జ్ వచ్చిందని ఇందుకు గాను రూ.10 వేలు డిపాజిట్ చెల్లించాలని కూల్‌డ్రింక్ దుకాణం పేరు మీద రశీదు అందజేశాడు. తన ఫోన్ నంబర్ ఇచ్చి రూ.10 వేలు వసూలు చేసి పరారైనట్లు బాధితుడు పేర్కొన్నారు. ఫోన్ స్విచ్ ఆఫ్ రావడంతో మోసపోయానని గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాము తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

నారాయణపేట: పట్టణంలోని వివిధ వార్డులకు చెందిన లబ్ధిదారులకు సోమవారం స్థానిక సీఆర్ భవన్‌లో ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ఎండీ. సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి. వేణుగోపాల్, వకీల్ సంతోష్, అడ్వకేట్ సతీష్‌గౌడ్ పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

కోస్గి : ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యచరణలో భాగంగా సోమవారం పట్టణంలోని 8వ వార్డులో తడి, పొడి చెత్తపై ఇంటిటా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరువేరు బుట్టల్లో వేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. ప్లాస్టి క్ వాడకాన్ని తగ్గించి బట్ట సంచులను వినియోగించాలన్నారు. అమృత్‌జల్ పథకం ద్వారా ప్రతి ఇంటి కి స్వచ్ఛమైన తాగునీరు అందిస్తామన్నారు. వార్డు ప్రజల సమస్యలు పరిష్కరించేందుకు సిబ్బంది నిరంతరం శ్రమిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్ కుమార్, హెల్త్‌అసిస్టెంట్ మొహిన్‌బాషా, నాగులపల్లి శ్రీనివాస్, సాయిలు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.



అవగాహన కల్పిస్తున్న మున్సిపల్ కమిషనర్ నాగరాజు

దరఖాస్తుల ఆహ్వానం

నారాయణపేట ఎడ్యుకేషన్: తెలంగాణ స్పోర్ట్స్ ఆథారిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడా పాఠశాలల్లో 2025- 26 విద్యా సంవత్సరం 4వ తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి బాలాజీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్రీడా పాఠశాల విద్యార్థుల ఎంపిక ఈ నెల 18వ తేదీన ఉదయం 9 గంటలకు జిల్లా కేంద్రంలోని మినీ స్టేడియంలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మూడో తరగతి ఉత్తీర్ణులై వారి ప్రగతి పత్రం, బొనఫైడ్, 10 పాస్‌పోర్టు సైజ్ ఫోటోలతో హాజరు కావాలన్నారు. పూర్తి వివరాలకు 91007 53683ను సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ కళాశాలల్లో చేరండి

- అధ్యాపకుల గ్రామబాట
- కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన
- విద్యార్థులకు, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్

మద్దూరు: ప్రభుత్వ కళాశాలల్లో కార్పొరేట్‌కు దీటుగా విద్యాబోధన సాగుతోంది. ప్రతి విద్యార్థికి అన్ని సౌకర్యాలను కల్పించడంతో పాటు ప్రభుత్వం అనుభవజ్ఞులైన లెక్చరర్లు పర్యవేక్షణలో ఉచిత విద్య అందజేస్తోందన్నారు. నగరాలకు వెళ్లి ఆర్థికంగా అవస్థలు పడకుండా స్థానికంగానే ప్రభుత్వ కళాశాలలు అందుబాటు ఉన్నాయని అధ్యాపకులు తెలిపారు. ప్రభుత్వ కళాశాలల్లో చదివిన విద్యార్థులు ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగాల్లో ఉన్నత స్థానాల్లో ఉన్నారని తల్లిదండ్రులకు వివరిస్తూ గ్రామాల బాట పట్టారు. మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ప్రస్తుతం తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యా బోధన సాగుతోంది. అన్ని సబ్జెక్టులను బోధించేందుకు పూర్తి స్థాయిలో లెక్చరర్లు ఉన్నారు. గతంలో కళాశాలలో అడ్మిషన్లు అధికంగా ఉండేవని, ప్రస్తుతం గురుకులాలు, మధ్య తగరతి విద్యార్థులు సైతం కార్పొరేట్ కళాశాల వైపు చూస్తుండడంతో అడ్మిషన్ల సంఖ్య తగ్గుతోందని అధ్యాపకులు ఆందోళన చెందుతున్నారు.

70 మంది.. కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ గ్రూపులకు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలో విద్యాబోధన జరుగుతోంది. ఇప్పటి వరకు దాదాపు ఆన్‌లైన్ ద్వార 70 మంది విద్యార్థులు అడ్మిషన్లు పొందారు. ప్రస్తుతం ద్వితీయ సంవత్సరంలో దాదాపు 117 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. అన్ని తరగతులకు సరిపడా తరగతి గదులు, అత్యాధునికి ల్యాబ్ సౌకర్యం, ఆట స్థలం, ప్రశాంత వాతావరణంలో కళాశాల ఉంటుంది.

నీట్, ఎంసెట్ కోచింగ్

కళాశాలలో అనుభవం ఉన్న లెక్చరర్లతో ఉచిత విద్యా బోధన, పాఠ్యపుస్తకాలు పంపిణీ చేయడంతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ మద్దిలేటి తెలిపారు. విద్యార్థులకు వేసవి సెలవుల్లో ఎంసెట్, నీట్ కోచింగ్ ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలలో చదివిన చాలా మంది విద్యార్థులకు నీట్, ఇంజనీరింగ్ కళాశాలల్లో ఉచిత సీట్లు సాధించారని పేర్కొన్నారు.



పల్లెర్లలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు

విద్యార్థులు వినియోగించుకోవాలి



మద్దూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అన్ని వసతులు ఉన్నాయి. అన్ని సబ్జెక్టులను బోధించడానికి ఉపన్యాసకులు అందుబాటులో ఉన్నారు. మూడు గ్రూపుల్లో ఇంగ్లిష్, తెలుగు మీడియంలో బోధన జరుగుతుంది. ఈ అవకాశాన్ని పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

– ఎస్.రాములు, ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్, ప్రభుత్వ జూనియర్ కళాశాల, మద్దూరు

మహిళలకు అండగా షీటీం

నారాయణపేట రూరల్: మహిళలు, బాలికలకు అండగా షీటీం నిలుస్తుందని కానిస్టేబుల్ కవిత అన్నారు. మండలంలోని కొల్లపల్లి జెడ్పీ స్కూల్లో విద్యార్థులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అపరిచిత వ్యక్తుల నుంచి ఇబ్బందులు ఎదురైతే వెంటనే టీ సేవ్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. బస్సుల్లో ప్రయాణం చేసేటప్పుడు, బస్టాండులో పోకిరీలు ఈవ్‌టీజింగ్‌కు పాల్పడినా,సైబర్ నేరాల బారిన పడిన డయల్ 100 లేదా 1930కు సమాచారం ఇవ్వాలన్నారు. అధికారులు, ప్రజా ప్రతినిధుల డీపీలతో డబ్బులు పంపమని అడిగితే నిరాకరించాలన్నారు. లాటరీల పేరుతో మోసం చేసేవారి నుంచి జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసులు బాలరాజు, జ్యోతి, టీచర్లు నారాయణరెడ్డి, వెంకటేష్, వినోద్, కవిత తదితరులు పాల్గొన్నారు.



కొల్లపల్లిలో అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

జాతీయస్థాయిలో గుండుమాల్ విద్యార్థి ప్రతిభ



దస్తమ్మను సన్మానిస్తున్న ఉపాధ్యాయ బృందం

కోస్గి: జాతీయ స్థాయిలో నిర్వహించిన నెట్‌బాల్ పోటీల్లో గుండుమాల్ విద్యార్థి దస్తమ్మ ఉత్తమ ప్రతిభ కనబరిచి తృతీయ స్థానం సాధించినట్లు గుండుమాల్ మండల విద్యాధికారి శేఖర్‌రెడ్డి తెలిపారు. మే 28 నుంచి జూన్ 1 వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని ఇండోర్‌లో జరిగిన జాతీయస్థాయి నెట్‌బాల్ పోటీలో రాష్ట్రం తరఫున బరిలోకి దిగిన దస్తమ్మ తృతీయ బహుమతి సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు. దీంతో స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ పాఠశాలలో ఉచిత సీటు పొందిన విద్యార్థికి ప్రభుత్వమే ఉచిత శిక్షణ అందిస్తుందని తెలిపారు. దస్తమ్మ, తల్లిదండ్రులను పాఠశాల ఉపాధ్యాయ బృందం పూలమాలలు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో స్వప్న, మల్లికార్జున్, కోచ్ సాధిక్ తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సదస్సులతో భూసమస్యల పరిష్కారం



నారాయణపేటలో దరఖాస్తులు అందిస్తున్న రైతులు



మాగనూర్‌లో భూభారతి కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

మాగనూర్: రెవెన్యూ సదస్సులతో భూ సమస్యలు పరిష్కారమవుతాయని డిప్యూటీ తహసీల్దార్ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. భూ సమస్యలు ఉన్న రైతులు నేరుగా సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీశైలం, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నారాయణపేట రూరల్: రెవెన్యూ సమస్యల పరిష్కారం కోసం భూభారతి చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని తహసీల్దార్ అమరేందర్‌కృష్ణ అన్నారు. పట్టణంలోని పరిమళాపురం హనుమాన్ ఆలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పల్లబుజూర్గ్ పరిధిలో 52, కొండారెడ్డిపల్లి శివారులో 30, గొల్లపల్లికి చెందినవి నాలుగు దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీకేఎస్ నాయకులు అనంత్‌రెడ్డి, వెంకోబ, మల్లప్ప, వేణుగోపాల్‌రెడ్డి, రైతులు పాల్గొన్నారు.

విద్యారంగ అభివృద్ధికి కృషి



నారాయణపేటలో విద్యార్థులకు నోటు పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి



విఠలాపురంలో..

నారాయణపేట రూరల్: విద్యారంగ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్న నోట్, పాఠ్య పుస్తకాలు, యూనిఫాంను సోమవారం స్థానిక గ్రౌండ్ హైస్కూల్‌లో ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థులు మంచిగా చదువుకొని పుట్టిన ఊరికి, తల్లిదండ్రులకు పేరు తీసుకొని రావాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖాధికారి గోవిందరాజులు, ప్రధానోపాధ్యాయుడు అంబదాస్, మార్కెట్ చైర్మన్ శివారెడ్డి, ఆర్టీఓ బోర్డ్ సభ్యుడు పోషల్ రాజేష్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు సలీం, మాజీ మార్కెట్ చైర్మన్ బండి వేణుగోపాల్, మార్కెట్ డైరెక్టర్ శరణప్ప, వకీల్ సంతోష్, కోట్ల రవీందర్‌రెడ్డి, మనోజ్, యూసఫ్తాజ్ పాల్గొన్నారు.

కొత్తపల్లి: మండలంలోని అల్లీపూర్, దుప్పడి గట్టు ప్రాథమిక పాఠశాలలో 150 మంది విద్యార్థులకు నోట్ పుస్తకాలను గొర్లోనిబాయి గ్రామానికి చెందిన యువకులు కావలి సతీశ్, కిరణ్‌కుమార్ పంపిణీ చేశారు.

చిన్నారులకు అక్షరాభ్యాసం

కోస్గి రూరల్: మండలంలోని బోగారం ప్రాథమిక పాఠశాలలో, కోస్గి పట్టణంలోని మున్నూర్‌వాడ అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులచే సామూహిక అక్షరాభ్యాసం చేపట్టినట్లు ఎంఈఓ శేఖర్‌రెడ్డి తెలిపారు. అనంతరం బాలింతలకు గుడ్లును పంపిణీ చేశారు. కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ అనురాధ, రాఘవేందర్, ఆత్మలింగం, రేణుక, గౌరీదేవి, ఖలీద్, సీఆర్పీ దస్తయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సరోజ తదితరులు ఉన్నారు.

10 అడ్మిషన్లు

గుండుమాల్ మండలంలోని బలుబద్రాయపల్లి అనుబంధ గ్రామమైన దానమ్మతండాకు చెందిన పది మంది విద్యార్థులు ప్రైవేటు పాఠశాలకు వెళ్లేవారు. ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సౌకర్యాలు కల్పిస్తుండటంతో బలుబద్రాయపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో వారు అడ్మిషన్ తీసుకున్నారని తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్వేత, ఉపాధ్యాయులు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

దామరగిద్ద: మండలంలోని విఠలపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠశాల మాజీ చైర్మన్ మహ్మద్ రఫీ పలకలు, బలపాలు అందించారు. అక్షరాభ్యాసం కార్యక్రమంలో విద్యార్థులకు తమ వంతుగా ఏటా పలకలు అందజేస్తున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హెచ్ఎం బాలమురళి, జీఎచ్ఎం ఆశన్న, మాజీ సర్పంచ్ ఆశన్న పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిషేధానికి పకడ్బందీ చర్యలు



వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న అధికారులు

నారాయణపేట: జిల్లాలో మాదకద్రవ్యాల నిషేధం అమలుకు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో మాదకద్రవ్యాల నిషేధం(యాంటీ నార్కోటిక్)పై ఏర్పాటు చేసిన సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. జిల్లాలోని అన్ని జూనియర్, డిగ్రీ కళాశాలలో యాంటీ డ్రగ్ కమిటీలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆయా కమిటీల నేతృత్వంలో మాదక ద్రవ్యాల నిషేధంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. గతంలో నమోదైన గంజాయి కేసులే తప్పా కొత్త కేసులేమి లేవని తెలిపారు. పోలీసుశాఖతో పాటు రెవెన్యూ, వ్యవసాయ, ఎక్సైజ్, వైద్యశాఖ అధికారులు నిషేధం అమలుకు సమిష్టిగా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జయచంద్రమోహన్ మాట్లాడుతూ.. పోలీసు శాఖ నిర్వహించే అవగాహన కార్యక్రమాల్లో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొని ఆరోగ్య పరంగా సలహాలు, సూచనలు ఇస్తారన్నారు. మాదకద్రవ్యాల నిషేధిత జిల్లాగా నారాయణపేటను మార్చాలని, అందుకోసం సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఆర్డీఓ రామచందర్‌నాయక్ కోరారు. కార్యక్రమంలో ఆర్డీవో మేఘాగాంధీ, కలెక్టరేట్ ఏఓ జయసుధ, సీ–సెక్షన్ అధికారులు రాణీదేవి, జీసీడీఓ నర్మద, డీఐఈఓ సుదర్శన్, బిక్షపతి, ఎక్సైజ్ అధికారులు పాల్గొన్నారు.